

రామన్నకు గొర్రెలు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

గుండుమల గ్రామానికి చెందిన ఓబుళమ్మ తనకు ఇల్లు లేదని ముఖ్యమంత్రికి విన్నవించుకుంది. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఓబుళమ్మ సొంత ఇంటి నిర్మాణానికి రూ3.50 లక్షలు మంజూరు చేశారు. అందుకు సంబంధించిన పత్రాలను ఓబుళమ్మకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఈనెల 22న అందజేశారు. అదేరోజు ఇంటి నిర్మాణానికి భూమిపూజ కూడా చేశారు. దీంతో ఓబుళమ్మ ఆనందానికి అవధుల్లేవు.

● చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటాం




నాకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పింఛన్ మంజూరు చేసి, చేయూతనిచ్చారు. ఇప్పుడు ఇల్లు కూడా మంజూరు చేయడంతో మాకెంతో సంతోషంగా ఉంది. చంద్రబాబునాయుడుకు ఎంతో రుణపడి ఉంటాం. - ఓబుళమ్మ, గుండుమల

గుండుమల వాసి రామన్న తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని సీఎం చంద్రబాబు ముందు మొరపెట్టుకున్నాడు. ఆదుకుంటానని సీఎం మాట ఇచ్చారు. పక్షం రోజులకే రామన్న గొర్రెల గోనులుకు ఆర్థికసాయం రూ.60వేలు మంజూరు చేశారు. ఆ సొమ్ముతో గొర్రెలు కొనుగోలు చేసి, ఈనెల 17న రామన్నకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అధికారులు పంపిణీ చేశారు. దీంతో ఆ కుటుంబం ఎంతో సంతోషించింది.

● ఇచ్చిన మాట నిలుపుకున్న చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. సీఎం స్వయంగా ఇంటికొచ్చి నాకు పింఛన్ అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. ఆ సమయంలో ఆర్థికసాయం చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గొర్రెలను కొనగోలు చేసి ఇచ్చారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు. - రామన్న, గుండుమల



చంద్రన్న మాటే శాసనం



- ఓబుళమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ
- రామన్నకు గొర్రెల కొనుగోలుకు ఆర్థికసాయం
- వక్క మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన
- రిజర్వాయర్ల నిర్మాణానికి తొలి అడుగు
- డీపీఆర్ తయారీకి రూ.28 లక్షలు
- నెరవేరుతున్న మడకశిర ప్రజల దశాబ్దాల కలలు

గుండుమల పర్యటనలో పలు హామీలు/నెల తిరక్కుండానే చకచకా అమలు

మడకశిర, ఆగస్టు 23: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండలంలోని గుండుమల గ్రామంలో ఈనెల 1వ తేదీన పర్యటించారు. లబ్ధిదారులకు పెంచిన పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. ఊరిలో ప్రజావేదిక ఏర్పాటు చేశారు. గ్రామస్థులతో మాత్రమే సమావేశమయ్యారు. వారి కష్టాలు విన్నారు. వారికి ఏం కావాలో అడిగి తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు. అన్నింటినీ నెరవేరుస్తానని మాట ఇచ్చారు. అంతే.. ఆ వెంటనే అమలుకు శ్రీకారం చుట్టారు. ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారు. నెల తిరక్కుండానే అన్నింటినీ నెరవేరుస్తున్నారు. దీంతో మడకశిర నియోజకవర్గ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఓబుళమ్మకు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

చకాచకా అమలు

గుండుమల గ్రామంలో ఈనెల 1న పింఛన్ పంపిణీ అనంతరం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటి, తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద, రొళ్ల మండలం రత్నగిరి వద్ద రిజర్వాయర్లను నిర్మించాలని కోరారు. వక్క మార్కెట్ నిర్మించి, రైతులను ఆదుకోవాలని విన్నవించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని సీఎం స్పష్టమైన హామీ ఇచ్చారు. వెంటనే వాటి అమలుకు శ్రీకారం చుట్టారు. రాళ్లపల్లి, రత్నగిరి రిజార్వాయర్ల నిర్మాణానికి తొలి అడుగు వేశారు. డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేయాలని సీఎంఓ నుంచి సంబంధిత హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు ఉత్తర్వులు అందాయి.

అందుకు రూ.28లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వక్క మార్కెట్ నిర్మాణానికి అమరాపురం మండలంలో సంబంధితశాఖాధికారులు స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ నిర్మాణం దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి.

●అభివృద్ధిని అటకెక్కించిన వైసీపీ



గుండుమల ప్రజావేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

మడకశిర ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉంటుంది. వేల ఎకరాలు బోర్లు తవ్వినా తేమ కూడా కనిపించదు. వర్షపాతం కూడా తక్కువే పడుతుంది. దీంతో వేల ఎకరాలు బీడుగా మారిపోయాయి. ఈ ప్రాంతంలో ఊళ్లకు ఊళ్లే ఉపాధికి పరాయి ప్రాంతానికి వలస వెళ్లాయి. ఈ ప్రాంతానికి నీరిస్తే.. ఈ భూములు సాగులోకి వస్తాయనీ, వలస వెళ్లే అవసరం ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ఆమేరకు గత టీడీపీ హయాంలో నియోజకవర్గానికి రెండు రిజర్వాయర్లను మంజూరు చేశారు. రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఇచ్చిన హామీ మేరకు మడకశిర ప్రాంతంలో ఐదు చెరువులకు నీరు ఇచ్చారు కూడా. ఇంతలోనే 2019లో ప్రభుత్వం మారడంతో రిజర్వాయర్ల నిర్మాణం అటకెక్కింది. గత వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో మళ్లీ రిజర్వాయర్ల నిర్మాణానికి చర్యలు ముమ్మరం చేశారు. రిజర్వాయర్లు నిర్మించి, హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతంలోని చెరువులను నింపితే వేలాది ఎకరాలు సాగులోకి వస్తాయని పాలకులు భావిస్తున్నారు. రిజర్వాయర్ల నిర్మాణం దిశగా డీపీఆర్ తయారీకి నిధులు మంజూరవడంతో ఈ ప్రాంత రైతుల దశాబ్దాల కల నెరవేరబోతోంది.

వక్క మార్కెట్ నిర్మాణానికి అడుగులు



మడకశిర ప్రాంత రైతులు వక్క విపరీతంగా పండిస్తున్నారు. వేల ఎకరాల్లో వక్క తోటలున్నాయి. పండించిన పంటను అమ్ముకునేందుకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేదు. కర్ణాటక ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడ దళారుల చేతిలో మోసపోతున్నారు. వారు అడిగిన రేటుకు పంట దిగుబడిని అమ్ముకోవాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మడకశిర ప్రాంతంలోనే వక్క మార్కెట్ నిర్మిస్తే రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు గిట్టుబాటు ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. వక్క మార్కెట్ నిర్మాణం ఈ ప్రాంత రైతుల దశాబ్దాల కల. గత టీడీపీ హయాంలోనే వక్క మార్కెట్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. 2019లో ప్రభుత్వం మారడంతో వక్క మార్కెట్ ఊసే లేకుండాపోయింది. వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, గుండమల పర్యటనలో చంద్రబాబు హామీ ఇవ్వడంతో మళ్లీ వక్క మార్కెట్ నిర్మాణానికి చర్యలు మొదలయ్యాయి. అమరాపురం మండలంలో ఇప్పటికే అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మడకశిర ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పరిస్థితీ అంతే. గత టీడీపీ హయాంలోనే నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మారడంతో రద్దు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రింగు రోడ్డు నిర్మాణానికి అడుగులు పడతాయని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలా.. సీఎం చంద్రబాబు గుండుమల పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ.. ఈ ప్రాంత ప్రజల్లో ఆనందం నింపుతున్నారు.

చేనేత ప్రాజెక్టుపై వెంటనే చర్యలు తీసుకోవాలి

చేనేత కార్మికసంఘం డిమాండ్

ధర్మవరం, ఆగస్టు 23: రూ.100 కోట్ల చేనేత ప్రాజెక్టును అక్రమ మార్గంలో దక్కించుకుని, ఆపై కార్మికుల పొట్టకొడుతూ మరమగ్గాలపై ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారుచేస్తున్న బకాసురుడు జింకా రామాంజనేయులుపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. 'పట్టుకేంద్రంలో బకాసురుడు..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. దీంతో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటనారాయణ.. చేనేత ప్రాజెక్టు యజమాని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ... జింకా రామాంజనేయులు రూ.100 కోట్ల ప్రభుత్వ ప్రాజెక్టును తెచ్చుకోవడమే కాకుండా 50 శాతం సబ్సిడీ కూడా నొక్కేశాడన్నారు. నిబంధనలకు తూట్లు పొడుస్తూ స్థానిక కార్మికులకు పనులు కల్పించకపోవడంతోపాటు చేనేత చట్టానికి వ్యతిరేకంగా ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారు చేస్తూ అక్రమార్జనకు తెరలేపాడన్నారు. పరిశీలనకు వెళ్లిన వారిపై బౌన్సర్లతో భౌతికదాడులకు దిగడం బట్టి చూస్తుంటే అక్కడ అరాచకం ఏస్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే పరిశ్రమను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు చేనేత కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

అధికారులెక్కడ?

చేనేత ప్రాజెక్టుపై మౌనవ్రతం.. సర్వత్రా విమర్శలు

ధర్మవరం, ఆగస్టు 23: బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద ఏర్పాటుచేసిన చేనేత ప్రాజెక్టులో నిబంధనల ఉల్లంఘనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. తప్పించుకునే ధోరణి అవలంబిస్తున్నారు. ప్రాజెక్టుకు రూ.50 కోట్లు సబ్సిడీ రూపేణా కట్టబెట్టి కూడా.. సంబంధం లేదని చెబుతుండడం విడ్డూరం. చేనేత జౌళి, పట్టుపరిశ్రమ శాఖల అధికారులు తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేస్తున్నారు. మరి.. రూ.50 కోట్ల ప్రజాధనం అప్పనంగా ఎవరు కట్టబెట్టారో? చేనేత ప్రాజెక్టులో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో చేనేత వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. చేనేత జౌళి శాఖ మంత్రి సవిత కూడా సీరియస్‌గా పరిగణించారు. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విచారణకు కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడం శోచనీయం.

నేతన్నకు అన్యాయం వాటిల్లితే ఉపేక్షించేది లేదు

- మంత్రి సవిత హెచ్చరిక
- పట్టుకేంద్రంలో బకాసురుడిపై ఆరా
- విచారించి, వివరాలు అందజేయాలని అధికారులకు ఆదేశం



ధర్మవరం, ఆగస్టు 23: నేతన్నలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తేలేదని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. నియోజకవర్గంలో ఓ బడా చేనేత వ్యవహారాలపై 'పట్టు కేంద్రంలో బకాసురుడు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనంపై మంత్రి ఆరాతీశారు. చేనేత చట్టానికి తూట్లు పొడిచి, అక్రమార్జనే ధ్యేయంగా పవర్‌లూమ్స్‌పై విచ్చలవిడిగా ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారు చేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.100 కోట్ల చేనేత ప్రాజెక్టులో సాగుతున్న అక్రమ తంతుపై పూర్తిస్థాయిలో విచారించి, నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గత వైసీపీ పాలనలో చేనేత పరిశ్రమ చిన్నాభిన్నమైందనీ, ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న తరుణంలో బడా నేతన్న.. స్థానిక కార్మికుల పొట్టకొట్టేలా వ్యవహరించడం ఏమిటని మంత్రి మండిపడినట్లు తెలుస్తోంది. విచారణ నిమిత్తం అధికారులు, ఇతరులు ప్రాజెక్టు వద్దకు వెళితే బౌన్సర్లతో దాడులు చేయించడం అమానుషమని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో 50శాతం సబ్సిడీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరుచేస్తే ఆ పరిశ్రమకే చెందిన వ్యక్తి కార్మికుల పొట్టకొట్టడం క్షమించరానిదని మంత్రి మండిపడినట్లు తెలుస్తోంది. తక్షణమే విచారించి, నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అక్రమాలు వాస్తవమని తేలితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఎమ్మెల్యే గణిత పాఠాలు..

బుక్కపట్నం, ఆగస్టు 23: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఉన్నత విద్యావంతురాలు. ఎంటెక్ పూర్తి చేశారు. గణితం అంటే కొట్టిన పిండే. తాను నేర్చుకున్న గణితాన్ని పిల్లలకు ఈజీగా అర్థమయ్యేలా బోధించి.. శెభాష్ అనిపించుకున్నారు. ఎమ్మెల్యే శుక్రవారం బుక్కపట్నంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ)ని తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లారు. టీచర్‌గా మారి, విద్యార్థినులకు పాఠ్యాంశాలు బోధించారు. వారికి ఈజీగా అర్థమయ్యేలా గణిత పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థినులను అడిగి, సమస్యలు తెలుసుకున్నారు. వంట గదిని, వసతిగృహాలను పరిశీలించారు. వసతులపై ఎస్ఓ సౌజన్యతో ఆరాతీశారు. కేజీబీవీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎస్ఓ కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.



కేజీబీవీలో పాఠాలు చెబుతున్న ఎమ్మెల్యే

పల్లెను ప్రగతిబాట పట్టిద్దాం



కొత్తచెరువులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

- ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు
- ఊరూరా సుస్థిర అభివృద్ధి పండుగ
- గ్రామ సభలకు పోటెత్తిన జనం

పుట్టపర్తి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా పల్లెను ప్రగతి బాట పట్టిద్దామని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. ఊరూరా సుస్థిర అభివృద్ధి పండుగ గ్రామసభలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా సభలకు జనం పోటెత్తారు. పల్లె ప్రగతిపై చర్చించారు. లేపాక్షిలో జిల్లా కలెక్టర్ చేతన్, కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట, పంతులచెరువులో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, కొత్తచెరువు, బుక్కపట్నంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మడకశిర మండలం కల్లుమర్రిలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ముదిగుబ్బలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తోపాటు జిల్లాలో అన్నిస్థాయిల అధికారులతోపాటు ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. పంచాయతీ వారీగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులపై ఎమ్మెల్యేలు, అధికారులు స్వర్ణగ్రామ పంచాయతీ రూపకల్పన అనే అంశంపై చర్చించారు. ప్రజలకు సౌకర్యాలు, పంచాయతీ అవసరాలు, అంతర్గత రహదారుల నిర్మాణం, నీటి సంరక్షణ చర్యలు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశువుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజలతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, పశువుల పెంపకం షెడ్లు, రెవెన్యూ, పింఛన్లు, ఇళ్ల పట్టాలు తదితర సమస్యలను ప్రజలు.. అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలు చెయ్యిచెయ్యి కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మొదటిరోజు జిల్లా వ్యాప్తంగా గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనగా.. పండుగ వాతావరణం కనిపించింది.



లేపాక్షి గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

గ్రామాల్లో సదుపాయాల కల్పనే లక్ష్యం

- కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఎమ్మెల్యే

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నాం. గ్రామీణుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలకు అధికారులు ప్రాధాన్యమివ్వాలి. త్వరలోనే ప్రభుత్వం పాడి పశువులను పంపిణీ చేస్తుంది. గ్రామీణులు అవకాశాలను అందిపుచ్చుకుని, అభివృద్ధి దిశగా అడుగులు వేయాలి.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను పక్కదారి పట్టించింది. గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే గ్రామ పంచాయతీలకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించి, పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారులు మా దృష్టికి తెస్తే పరిష్కారానికి నిధులు కేటాయించి, పనులు చేపడతాం.

- పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

గామాలకు పూర్వవైభవం తెస్తాం

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, పూర్వవైభవం తెస్తాం. గ్రామసభల ద్వారా ప్రజాసమస్యలు తెలుసుకుని, తద్వారా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తాం. గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. పైసా నిధులివ్వకపోవడంతో పల్లెల్లో చీకట్లు అలుముకున్నాయి. కూటమి ప్రభుత్వం పల్లెల ప్రగతికి నడుం బిగించింది.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే



కల్లుమర్రి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

5 నుంచి వాటర్‌వర్క్స్ కార్మికుల సమ్మె



డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న వాటర్ వర్క్స్ యూనియన్ల నాయకులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 23: శ్రీరాంరెడ్డి, సత్యసాయి తాగునీటి సరఫరా పథకాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 5 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులకు ఆరునెలలుగా రావాల్సిన వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటివి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబరు 5 నుంచి సమ్మె చేపట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, రాము, అశోక్, వీరయ్య, నరేష్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీని ఆధునికీకరించాలి: సీపీఐ

అనంతపురం విద్య, ఆగస్టు 23: జిల్లాకు సాగు, తాగునీటిని అందించే హెచ్చెల్సీని రాష్ట్ర సరిహద్దు నుంచి ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ డిమాండ్ చేశారు. ఇందుకోసం రూ.500 కోట్లను కేటాయించాలన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిచ్చిమొక్కలు, పూడికతో హెచ్చెల్సీ అధ్వానంగా మారిందన్నారు. దీంతో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయి, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కనీసం 4 వేల క్యూసెక్కులు ప్రవహించేలా పనులు చేయాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యాం ఎత్తును 2023లో ఒక అడుగు పెంచారని, దీంతో 10 నుంచి 15 టీఎంసీలు నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందన్నారు. పెరిగిన నీటి నిల్వ నేపథ్యంలో ఆంధ్రాకు రావాల్సిన వాటాకు అనుగుణంగా పంపకాలు పెంచాలని కోరారు.

తెలివిగా టోకరా!

- అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పిస్తానని మోసం
- విడతల వారిగా రూ.2.8 లక్షలు వసూలు
- అడిగితే బాధితురాలిని బెదిరిస్తున్న లీడర్ కం టీచర్
- చోద్యం చూస్తున్న ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులు



ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం విద్య, ఆగస్టు 23: పోస్టు ఇప్పిస్తానని చెప్పి ఓ యూనియన్ లీడర్ అంగన్‌వాడీ లబ్ధిదారుతో విడతల వారిగా రూ. లక్షలు లాగేసింది. రోజులు గడిచినా చెప్పిన పోస్టు రాకపోవడంతో ఆ లబ్ధిదారులు ఆందోళన చెందింది. తన డబ్బులు ఇవ్వమని అడిగితే ఇచ్చేది లేదు ఏం చేసుకుంటావో చేసుకో అంటూ ఆ లీడర్ బెదిరించింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన లబ్ధిదారురాలు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసు విచారణలో సైతం యూనియన్ లీడర్ లక్షలు వసూలు చేసినట్లు తేలిందని సమాచారం. ఫిర్యాదులు ఎక్కువ కావడంతో ఆ లీడర్‌ను యూనియన్ నుంచి గెంటేశారు. అయితే ఐసీడీఎస్ శాఖలోని ఉన్నతాధికారులు మాత్రం తమకు ఏం తెలీదన్నట్లుగా చోద్యం చూస్తున్నారు.

సెల్ఫ్ డబ్బాతో టోపీ...!

నగరంలోని పాతూరులోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలోని ఓ తల్లి తన పిల్లలను సెంటర్‌కు పంపేది. ఆ సెంటర్‌లో పనిచేసే అంగన్‌వాడీ టీచర్, యూనియన్ లీడర్‌గా చెప్పుకుంటూ తల్లిని పరిచయం చేసుకుంది. తనకు సీఐటీయూలో మంచి గ్రిప్ ఉందంటూ సెల్ఫ్ డబ్బా కొట్టుకుంది. నా సెంటర్‌లోనే అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పిస్తానని, కొంత ఖర్చు అవుతుందని, డబ్బులు సరిచేసుకోవాలని యూనియన్ లీడర్ ఆ తల్లికి సూచించింది. దీంతో పోస్టు పక్కా అనుకుని ఆ అమాయక లబ్ధిదారురాలు కొంత డబ్బు జమ చేసుకుంది. ఈ లోగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రావడంతో ఆమె 2022 సెప్టెంబరులో అదే సెంటర్‌లో ఆయా పోస్టుకు దరఖాస్తు చేసింది. ఆ రోజే యూనియన్ లీడర్ మాయమాటలు చెప్పి రూ.లక్ష తీసుకుంది. లబ్ధిదారురాలు అదృష్టం కొద్దీ ఆయా పోస్టు వచ్చింది. టీచర్ పోస్టు నీకు కచ్చితంగా ఇప్పిస్తా, మరికొంత డబ్బు సర్దుబాటు చేయమని ఆమెకు చెప్పింది. 2022 సెప్టెంబరు చివరి వారంలో ఆయా పోస్టు ఉత్తర్వులు తీసుకునే రోజునే రూ. 1.8 లక్షలు ఆమె నుంచి యూనియన్ లీడర్ లాగేసింది.

యూనియన్ నుంచి గెంటివేత

యూనియన్ లీడర్ వసూళ్ల బాగోతం సీఐటీయూ నాయకులకు తెలియడంతో ఆమెను యూనియన్ నుంచి బయటకు గెంటేశారు. ఎవరైనా అడిగితే నేనే బయటకు వచ్చా అంటూ చెప్పుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో టీచర్ పోస్టు కోసం డబ్బులిచ్చిన ఆయా తన సొమ్ము అడిగితే 'వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ లేదా టీడీపీ ట్రేడ్ యూనియన్‌లో చేరుతా. ఎన్నికలు పూర్తి కాగానే ఏ ప్రభుత్వం వచ్చినా నీ పని అవుతుంది' అంటూ నమ్మబలికింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా పోస్టు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన ఆ ఆయా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది.

చర్యలు ఏవీ...?

యూనియన్ లీడర్ కం అంగన్‌వాడీ టీచర్‌పై బాధితురాలు ఈనెల 5న కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. తన నుంచి రూ. 2.8 లక్షలు తీసుకుని మోసం చేసిందని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కలెక్టరేట్ అధికారులు ఇది చీటింగ్ కేసు అంటూ జిల్లా ఎస్పీ ఆఫీస్‌కు పంపారు. అక్కడ ఫిర్యాదు చేయడంతో వాళ్ల నగరంలోని వన్‌టౌన్‌కు సిఫార్సు చేశారు. విచారణ చేసిన పోలీసులు ఆ టీచర్ డబ్బులు లాగేసినట్లు గుర్తించారు. కేసు వరకూ ఎందుకు? తీసుకున్న డబ్బులు ఆమెకు తిరిగి ఇచ్చేయండి అంటూ ఆ టీచర్‌కు పోలీసులు చెప్పినా ఆమె ససేమిరా అన్నట్లు తెలిసింది. కేసు పెట్టుకోండి అంటూ ఆ టీచర్, మాజీ యూనియన్ లీడర్ బింకాలు పోతున్నట్లు సమాచారం. అయితే ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓ ఆఫీస్ ఉన్నతాధికారులు ఈ ముడుపుల బాగోతంపై చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గ్రామసభలో టీడీపీ నాయకుడిపై దాడి

బాధితుడిని ఫోన్‌లో పరామర్శించిన ఎమ్మెల్యే శ్రావణి



దాడిలో గాయపడ్డ భైరవేశ్వర్

యల్లనూరు, ఆగస్టు23: మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు భైరవేశ్వర్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దిలీప్‌రెడ్డి, పెద్దిరెడ్డితోపాటు మరికొంతమంది శుక్రవారం దాడి చేశారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన గ్రామసభలను నిర్వహించారు. వెన్నపూసపల్లిలో నిర్వహించిన గ్రామసభలో టీడీపీకి చెందిన భైరవేశ్వర్ గ్రామంలో పనులకు సంబంధించిన వాటిని నమోదు చేసుకోవాలని పంచాయతీ సెక్రటరీ మాబుకు తెలియజేశారు. అయితే మాబు వాటిని నమోదుచేయకుండా వైసీపీ నాయకులు చెబుతున్న పనులను నమోదు చేస్తుండడంతో ఇదేమిటని భైరవేశ్వర్ ప్రశ్నించాడు. దీంతో వైసీపీ నాయకులు భైరవేశ్వర్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలోనే భైరవేశ్వర్‌పై వైసీపీ నాయకులు దాడికి దిగారు. దీనిపై భైరవేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి బాధితుడు భైరవేశ్వర్‌కు ఫోన్ చేసి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల తీరుపై మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కాగా అత్యంత సమస్యాత్మక గ్రామమైన వెన్నపూసపల్లిలో గ్రామసభ జరుగుతున్నా ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఎందుకు ఏర్పాటు చేయలేదన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామసభలకు టీడీపీ, వైసీపీ వర్గాలకు చెందిన వారు హాజరవుతారని తెలిసినా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ఎంపీడీఓ అత్యుత్సాహం..!

గ్రామసభకు వైసీపీ నేత అధ్యక్షత

డీ.హీరేహాళ్, ఆగస్టు 23: మండలంలోని మలపనగుడిలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామసభకు వైసీపీ మండల కన్వీనర్ ఎలా అధ్యక్షత వహిస్తారని టీడీపీ నాయకులు, ఎంపీడీఓ రఘుతో వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. మలపనగుడి పంచాయతీలో కూడా ఆయా శాఖలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ వద్దకు వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి రాగానే ఎంపీడీఓ రఘునాథ్ ఆయనను ఆహ్వానించి సభకు అధ్యక్షత వహించాలని కోరారు. దీనికి టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇదేమైనా వైసీపీకి సంబంధించిన సభ లేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామసభనా అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు మాత్రమే సభకు అధ్యక్షత వహించే విధంగా చర్యలు చేపట్టాలని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులకు, టీడీపీ నాయకులకు కాసేపు మాటల యుద్ధం జరిగింది. ఇది తీవ్రస్థాయికి చేరడంతో వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి గ్రామ సభ నుంచి వెళ్లిపోయారు.

ఆవిష్కరణలకే పట్టం: ఎస్కేయూ వీసీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: గ్రామీణ, చిన్నపట్టణ ప్రాంతాల్లో పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేలా సాధికారత ఆవిష్కరణలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టం కడుతున్నాయని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో సాధికారత ఆవిష్కరణల వేడుకలు ప్రారంభించారు. వీసీ అనిత మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఆశాజనకమైన ఔత్సాహికులకు అవసరమైన వనరులను సమకూరుస్తామన్నారు. కొత్త వ్యాపారాలకు మద్దతిచ్చి విజయం సాధించేలా స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్‌చేసి సరికొత్త మైలురాయిని అధిగమించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగభూషణరాజు, మేనేజర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

వీసీకి క్లాస్‌మేట్స్ సన్మానం

వీసీ అనితను ఆమె క్లాస్‌మేట్స్ కలిసి సన్మానించారు. 1980లో పామిడి ప్రభుత్వ పాఠశాలలో వీసీ అనిత పదో తరగతి అభ్యసించారు. తరగతి స్నేహితులైన ఐపీఎస్ సాయిమనోహర్ తదితరులు వారి పాఠశాల స్మృతులను గుర్తుచేసుకుని వీసీని అభినందించారు.

కృత్రిమ మేధస్సుతో సాంకేతిక అభివృద్ధి

- ఐఐఎస్‌టీ సైంటిస్ట్ మనోహర్



కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: సాంకేతిక అభివృద్ధిలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ అండ్ సైన్స్ టెక్నాలజీ(ఐఎస్ఎస్‌టీ) సైంటిస్ట్ డాక్టర్ మనోహర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సెంట్రల్ యూనివర్సిటీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, మనోహర్‌కుమార్ హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయం, అడవులు, పట్టణ విస్తరణ, వాతావరణం పరిరక్షణకు రిమోట్ సెన్సింగ్ ఎంతో ఉపయోగ పడుతోందన్నారు. మెషిన్ లర్నింగ్, డీప్ లర్నింగ్ కోర్సులు రిమోట్ సెన్సింగ్‌లో అకాశాలను కల్పిస్తుందని తెలిపారు. అంతరిక్షంలోకి రాకెట్లను పంపడం నుంచి చంద్రుడిపై ల్యాండ్ అయ్యేంత వరకు భారత సాంకేతిక పరివర్తనకు కృత్రిమ మేధస్సు నిదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా అయ్యవార్లు మాకే కావాలి

కెంచెంపల్లిలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



ప్లకార్డులతో నిరసన చేపట్టిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు

కుందుర్పి, ఆగస్టు 23: 'సార్...! మా అయ్యవార్లు మాకే కావళ్ల. వాళ్లను ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయొద్దు' అని మండలంలోని కెంచంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ పాఠశాలలో పని చేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో వేరే పాఠశాలలకు బదిలీ చేశారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కొండల మధ్య ఉన్న గ్రామంలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 92 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉండేవారు. అందులో ముగ్గురిని సర్దుబాటు పేరుతో వేరే పాఠశాలలకు బదిలీ చేశారు. దీంతో తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్దుబాటును ఆపి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఇక్కడే కొనసాగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

అవనికి మేఘాల ఛత్రం





అవనిపై అంబరానికి ఎప్పుడూ అంతులేని అనురాగమే..! అందుకే కాబోలు అప్పుడప్పుడు భానుడి కిరణ తీక్షత నుంచి ఉపశమనం కలిగించడానికి అన్నట్లు మేఘాల ఛత్రం పంపుతుంటుంది. పైన కనిపిస్తున్న ఆకాశవీధిలో వెండి మబ్బుల ఫొటో అనంతపురం నగరంలోని క్లాక్ టవర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటికి చిక్కింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నాగేంద్ర (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 23: విద్యుదాఘాతంతో మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన రైతు వడ్డే నాగేంద్ర(26) శుక్రవారం తన పొలంలోనే మృతి చెందాడు. గ్రామానికి చెందిన నాగేంద్ర కొండల్లో రాళ్లు కొట్టే వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాళ్లు కొట్టుకుని వచ్చి సాయంత్రం పొలం చూసేందుకు వెళ్లాడు. అక్కడ మోటారు వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న సర్వీసు వైరు ఇనుప కంచెపై పడింది. దాన్ని గమనించకుండా నాగేంద్ర కంచెను దాటే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో కంచె అతడి చేతికి తగిలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలాడు. స్థానికులు గమనించి వెంటనే బళ్లారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య పవిత్రతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23: ఉత్తమ క్రీడా అవార్డులకు అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ షఫీ తెలిపారు. ప్రతి ఏటా జాతీయ క్రీడా దినోత్సవం ఆగస్టు 29న శాప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు అవార్డు అందజేస్తామన్నారు. జాతీయ స్థాయిలో అసోసియేషన్లు, ఖేలో ఇండియా, యూనివర్సిటీ, స్కూల్ గేమ్స్‌లో రాణించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఈనెల 27లోపు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.


జీడిపల్లిలో 1.097 టీఎంసీల నిల్వ

బెళుగుప్ప, ఆగస్టు 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ శుక్రవారానికి 1.094 టీఎంసీలకు చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 955 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు చెప్పారు.

26 వరకు ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: ఐటీఐ కళాశాల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈ నెల 26వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు 29న ప్రభుత్వ, 31న ప్రైవేట్ కళాశాలలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, ఆగస్టు 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 3800 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.ఆరు పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.15,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 263 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మిద్దె కూలి నలుగురికి గాయాలు

ఉరవకొండ,ఆగస్టు23: మిద్దెకూలి నలుగురు గాయపడిన సంఘటన వజ్రకరూరు మండలంలోని బోడిసానిపల్లి గ్రామంలో జరిగింది. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిద్దె బాగా నానడంతో కుప్పకూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న భార్యభర్తలు రాజేష్, భాగ్యమ్మలతో పాటు వారి తల్లి పార్వతి, బంధువులైన వన్నూరుస్వామికి గాయాలు అయ్యాయి. వారు కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వారిని 108వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా పక్క గదిలో ఉన్న రాజేష్, భాగ్యమ్మల కుమార్తెకు తృటిలో ప్రమాదం తప్పింది.

అంజన్న సన్నిధిలో ఏపీ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ అథారిటీ చైర్మన్



స్వామివారికి పూజలు చేస్తున్న జస్టిస్ గంగారావు

గుంతకల్లు, ఆగస్టు 23: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏపీ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ అథారిటీ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావు శుక్రవారం ఉదయం పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి సన్నిధిలో నామార్చనలు చేయించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, స్వామి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేసి, ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మల్లికార్జున, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- కసాపురం ఆలయంలో భక్తులకు అన్నదానం చేసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ఎస్ వెంకటరాముడు జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు ఎస్ నాగాంజనేయులు, రూ.99,999లు ఆలయ సూపరింటెండెంటు వెంకటేశులుకు అందజేశారు.
- బళ్లారి నగరానికి చెందిన కే శ్రీనివాస ప్రసాద్ స్మృత్యర్థం ఆయన సతీమణి సులోచనబాయి రూ.50వేలను ఏఈఓ మల్లికార్జునకు అందజేశారు. వితరణకర్తలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన పెరగాలి

- జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు



ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. వర్సిటీ ఆవిర్భావ దినోత్సవాలను శుక్రవారం ఓటీపీఆర్ఐలో వీసీ సుదర్శన రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను తీసుకున్నవారు మానసిక స్థితిని కోల్పోయి అనారోగ్యానికి గురవుతారన్నారు. అదేవిధంగా ప్రమాదకర చర్యలకు పాల్పడతారని తెలిపారు. అందుకే వర్సిటీ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఓఎస్‌డీటు వీసీ దేవన్న, డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ స్వరూపరాణి, ప్రిన్సిపాల్ గోపినాథ్, ఏఆర్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభాలు అధిగమిస్తేనే విజయాలు

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు



విద్యార్థులతో ప్రొఫెసర్లు వెంకటరావు, నారాయణరెడ్డి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: వ్యాపారాల్లో ఒడిదుడుకులు, సంక్షోభాలను అధిగమించిన సంస్థలే విజయాలబాటలో పయనిస్తాయని పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ మేనేజ్‌మెంట్ విభాగంలో యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ నారాయణరెడ్డి అధ్యక్షతన 'బిల్డింగ్ రెజిలెన్స్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్' అనే అంశంపై విద్యార్థులకు సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న వెంకటరావు వ్యాపార సంస్థల సుస్థిరాభివృద్ధి, మెలకువలు తదితర అంశాలపై సెమినార్ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు హుస్సేన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వేమన సాహితీయాత్ర

వివిధ రాష్ట్రాల నుంచి 50మంది కవుల రాక

పెనుకొండ, ఆగస్టు 23: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేమన సాహితీయాత్ర నిర్వహిస్తామని జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. ఈ యాత్రలో వివిధ రాష్ట్రాల నుంచి 50మంది కవులు పాల్గొంటారన్నారు. ఈ సాహితీయాత్ర కదిరి నుంచి ప్రారంభమై వేమన సమాధి ఉన్న కటారుపల్లికి చేరుకుంటుందన్నారు. అక్కడ 25మంది కవులతో వేమన సాహితీవేదిక నిర్వహిస్తామన్నారు. తర్వాత తిమ్మమ్మ మర్రిమాను వద్దకు చేరుకుని మరో 20మంది కవులతో సమ్మేళనం నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం కృష్ణదేవరాయల సన్మానసభలో 50మంది కవులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహితీ అకాడమీ గ్రహీత చదువులబాబు, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, తెలుగుభాష శాఖ అధ్యక్షులు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు రజిత హాజరవుతారన్నారు.



భూమి కొనుగోలుదారులను విచారిస్తున్న అదనపు కమిషనర్

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

బత్తలపల్లి ఆగస్టు 23 : మండలంలో ఫ్రీహోల్డ్ భూములను సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పోట్లమర్రి గ్రామం వద్ద సర్వే నంబరు 392-2లోని ఫ్రీహోల్డ్ భూమిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి కొనుగోలుపై సంబంధికులను విచారించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయనికి వెళ్లి, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా ఫ్రీహోల్డ్ భూములను ఎవరైనా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండుంటే బాధితులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ నటరాజన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధికారుల పాట్లు : గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ముఖ్య నాయకులు మండలంలో జాతీయ రహదారుల వెంబడి రూ.కోట్లు విలువచేసే భూములను యజమానులను బెదిరించి, తక్కువకే లాక్కున్నారు. ఫ్రీహోల్డ్ అస్త్రాన్ని ప్రయోగించారు. వీటిలో పలు అక్రమాలు బయటపడ్డాయి కూడా. సీసీఎల్ఏ అదనపు కమిషనర్‌కు వైసీపీ నాయకులు కొనుగోలు చేసిన భూముల వివరాలివ్వకుండా దాచేందుకు మండలస్థాయి అధికారులు విశ్వప్రయత్నాలు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలీసు సమస్యలపై 11 ఫిర్యాదులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 23: పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో శుక్రవారం నిర్వహించిన పోలీసు ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 11 అర్జీలు అందాయి. వాటిని ఏఎస్పీ విష్ణు స్వీకరించారు. బదిలీలు, సస్పెన్షన్ రీటక్, సరెండర్ లీవ్, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలపై అర్జీలు అందినట్లు ఏఎస్పీ తెలిపా రు. సిబ్బంది సమస్యలను ముఖాముఖిగా తెలుసుకున్న ఏఎస్పీ సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపుతామని సూచించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ విష్ణు

నేడు విద్యుత్ సరఫరా బంద్

ధర్మవరం, ఆగస్టు 23: పట్టణంలో శనివారం ఉదయం 11-30 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఈలు కొండారెడ్డి, నాగభూషణం, జానకీరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంనగర్, కొత్తపేట, గాంధీనగర్, మారుతీనగర్, సత్యసాయినగర్, టీచర్లు కాలనీ, రేగాటిపల్లి రోడ్, శాంతినగర్, శారదానగర్, గుట్టకిందపల్లి, గూడ్‌షెడ్ కొట్టాల, చంద్రబాబునగర్, నేసేపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మదీనా మసీదు కమిటీ ఎంపిక



నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం : ధర్మవరం జామియా మసీదు ఆధ్వర్యంలో శుక్రవారం మదీనా మసీదు నూతన కమిటీని ఎంపిక చేశారు. ముతవల్లిగా నాగూర్‌హుస్సేన్, వైస్ ముతవల్లిగా ఇస్మాయిల్, సెక్రటరీగా నడిం మసీద్ అల్తాఫ్, సభ్యులుగా చాంద్‌బాషా, ససలీం, బాబుల్లా, టైల్స్ అబ్దుల్లా, మహబూబ్‌బాషా, సాధిక్, అయూబ్, అజీజ్, బాబుఖాన్, ఖాజా, మదర్‌వలీను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు అబ్దుల్‌ఖాదర్, అబ్దుల్ మునాఫ్, రహంతుల్లా, అబ్దుల్ సలాం, అస్లాం, ఫారూక్, రాళ్లపల్లిషరీఫ్, అత్తార్ రహీంబాషా పాల్గొన్నారు.

కొనసాగిన సత్యసాయి తాగునీటి కార్మికుల సమ్మె

ముదిగుబ్బ, ఆగస్టు 23 : మండల కేంద్రంలోని సత్యసాయి పంపు హౌస్ వద్ద శుక్రవారం సత్యసాయి త్రాగునీటి కార్మికులు సమ్మె రెండవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 5నెలలుగా జీతాలు అందలేదని, 11నెలలు పీఎఫ్ అందించలేదని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని, అధికారులు జీతాల సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి త్రాగునీటి కార్మికులు పాల్గొన్నారు.



పంపు హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 23: అగళి పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అగళి పోలీసుస్టేషన్‌లో జప్తు చేసిన ద్విచక్రవాహనాన్ని ఓ మెకానిక్ షెడ్డు వద్దకు తీసుకెళ్లి విడిభాగాలను మార్చేందుకు ప్రయత్నించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విదితమే. ఈ విషయాన్ని ఎస్పీ తీవ్రంగా పరిగణించి, ప్రాథమిక విచారణ అనంతరం హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏం కావాలో చెప్పండి..!

గ్రామ సభలలో ప్రజలను కోరిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

పల్లెల అభివృద్ధికి కార్యాచరణ



గాండ్లపెంట గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట



బుక్కపట్నం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి



ఉప్పలపాడు గ్రామసభలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

సమస్యలపై వినతి పత్రాలు సమర్పించిన ప్రజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభల్లో పాలకులు, అధికారుల దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకొచ్చారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అన్ని గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. వాటిని పరిష్కరించాలంటూ వినతిపత్రాలతో ప్రజలు గ్రామసభలకు పోటెత్తారు.

● గాండ్లపెంట : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. గాండ్లపెంట ఈద్గా, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరి, సొసైటీ భవనం నిర్మాణానికి స్థలం, పోతువాండ్లపల్లి నుంచి వెలుగుట్టివారిపల్లి వరకు సీసీ రోడ్లు నిర్మాణం, గజ్జలవాండ్లపల్లి చేతిపంపు మరమ్మతులు.. సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

● తనకల్లు: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహించిన గ్రామసభలో కదిరి ఎమ్మెల్యే కంది కుంట పాల్గొన్నారు. మండలంలోని 17 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.

● నల్లచెరువు : మండలంలోని పంతులచెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కదిరి ఎమ్మెల్యే పాల్గొన్నారు. పింఛన్లు, పక్కాగృహాలు మంజూరు చేయాలని పలువురు వినతిపత్రం అందించారు.

● కొత్తచెరువు : స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని సత్యసాయి నీటిసరఫరా కార్మికులు వారికి వినతి పత్రం అందజేశారు. కొత్తచెరువులో కరెంట్ సమస్య తీవ్రంగా ఉందని, ఇష్టానుసారంగా కోతలు విధి స్తున్నారని ప్రజలు ఫిర్యాదు చేశారు. పలు మార్లు ట్రాన్స్‌కో ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. అలాగే ఇరగలపల్లి నుంచి తలమర్లకు, మరుకుంట పల్లి నుంచి పోతులకుంటకు తారు రోడ్డు వేయాలని ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు అధికారులను కోరారు.

● బుక్కపట్నం : స్థానికంగా నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. సమస్యలపై పలు వినతి పత్రాలను అందుకున్నారు.

● ముదిగుబ్బ: స్థానిక ఉప్పలపాడు గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. సమస్యలపై వినతలు స్వీకరించారు. అనంతరం ఉప్పలపాడు ఇసుక రీచ్‌ను పరిశీలించారు.

● కదిరి అర్బన్ : మండలం కుమ్మరవాండ్లపల్లిలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీలోని బాలప్పగారిపల్లి గ్రామస్థులు ఎంపీడీఓ ఆంజనప్పకు వినపత్రం అందించారు.

● పుట్టపర్తిరూరల్ : మండలంలోని కప్పల బండలో ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి గ్రామసభ నిర్వహించారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

● నల్లమాడ: మండలంలోని 14 పంచాయతీల్లో శుక్ర వారం గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. మండలానికి రూ. 3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఏఏ గ్రామాల్లో సమస్యలున్నాయో గుర్తించి ఆ నిధులతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

● ఓబుళదేవరచెరువు : మండలంలోని సున్నపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నీడ, నీరు, మజ్జిగ సౌర్యం కల్పించాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు అధికారులకు వినతిపత్రం అందించారు.

● అమడగూరు : మండలంలోని 10 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆర్‌డిటి పాఠశాలలో గ్రామ సభ నిర్వహించారు.

● తాడిమర్రి : మండలంలోని 13 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. చిల్లావారిపల్లి, చిల్ల కొండయ్యపల్లి, కునుకుంట్ల, పిన్నదరి, శివంపల్లి, మద్దల చెరువు, నారసింపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజలు ఫిర్యాదులు చేశారు.

● ధర్మవరంరూరల్ : మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రధానంగా సీసీరోడ్లు వేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరారు.









కుమ్మరవాండ్లపల్లిలో వినతప్రతం అందజేస్తున్న గ్రామస్థులు కప్పలబండలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నల్లమాడ మండలం పుగలంపల్లి, ఓడీసీలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

పుట్టపర్తి, ఆగస్టు 23 : స్థానిక మునిసిపల్ కార్యాలయాన్ని విజిలెన్స్ అధికారి డీసీటీఓ విజయలక్ష్మి, ఏఈ రాజశేఖర్, ఏజీ శివప్రసాద్, పోలీసు సిబ్బంది చంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. నెల రోజులు తిరక్కుండానే విజిలెన్స్ అధికారులు మరోసారి ఆ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేయడం విశేషం. దీంతో ఒక పక్కన సిబ్బంది, మరో పక్కన పాలక వర్గం హడలిపోయారు. వాహనాల మరమ్మతులు, డీజిల్ కొనుగోలు బిల్లులు, సత్యసాయి జయంతి వేడుకల్లో నిధుల ఖర్చులకు సంబంధించిన రికార్డులు, కొళాయి పన్నుల బిల్లులను స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్ అంజయ్య, సిబ్బందిని విచారించారు. మూడేళ్లలో చేసిన ఖర్చుల న్నింటిపై ఆరాతీసినట్లు సమాచారం. పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు తెల్సింది. డీసీటీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. స్థానికంగా కొంతమంది అమరావతి మునిసిపల్ పరిపాలన విభాగానికి ఫిర్యాదు చేయడంతోనే ఈ తనిఖీలు చేపట్టామని, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని ఆమె పేర్కొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

26, 27 తేదీల్లో కృష్ణాష్టమి వేడుకలు

ధర్మవరం, ఆగస్టు 23: స్థానిక కొత్తపేట బాలాజీ నగర్‌లోని గీతామందిరంలో సోమ, మంగళవారాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ మందిర కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం అభిషేకం, కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, పాలాభిషేకం, మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్సవ విగ్రహ అలంకరణ, సాయంత్రం ఐదు గంటలకు శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి ఏడు గంటలకు గీతామందిరంలో భజనలు ఉంటాయన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకు సుప్రభాతసేవ, ఆరు గంటలకు శ్రీకృష్ణార్జునుల స్వామివార్లకు పంచామృతాభిషేకం, ఏడు గంటలకు గీతాపారాయణం, 12 గంటలకు భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

ఉచిత ఇసుక విధానంపై సమీక్ష

పుట్టపర్తి, ఆగస్టు 23 : ఉచిత ఇసుక విధానంపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇసుక రేవులు స్టాకుపాయింట్ల వద్ద వాహనాల రద్దీ లేకుండా చూడాలన్నారు. ఇసుక వినియోగంపై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. కలెక్టరేట్లో టోల్‌ఫ్రీ నెంబరుతో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని, తాడిమర్రి మండలంలోని సీసీరేవు వద్ద ఇసుక రీచ్ పనులు ప్రారంభించామని వివరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, మైన్సు ఏడీ రాంమోహన్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించండి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 23: స్థానిక హిందూశ్మశానవాటికకు ప్రహరీని నిర్మించాలని ఎంపీడీఓ వరలక్ష్మీకి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుతోట హరి, జిల్లా యువమోర్చా కార్యదర్శి నరేష్‌బాబు శుక్రవారం వినతిపత్రం అందించారు. గతంలో పలుమార్లు ప్రహరీని నిర్మించాలని కోరామని, అయినా అధికారులు పట్టించుకోలేదని అన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

బుక్కపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను కొత్తచెరువు రూరల్ సీఐ సురేష్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఆయన వెంట ఎఎస్ఐలు మస్తాన్, రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

ధర్మవరం, ఆగస్టు 23 : స్థానిక దుర్గానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వెంకటేశ్‌పై ఆదినారాయణ రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. వెంకటేశ్ శుక్రవారం సిద్దయ్యగుట్టలోని సాయిబాబా గుడి వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. ఆదినారాయణ అనే వ్యక్తి ఆపి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో ఆదినారాయణ అక్కడే ఉన్న రాయిని తీసుకుని వెంకటేష్ తలపై బాదాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కదిరి అర్బన్, ఆగస్టు 23: రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పరిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బా రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎగువపల్లి గ్రామంలో ఈ-పంట నమోదును ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఓ శ్రీనివాసరెడ్డి, వీహెచ్ఏ ప్రసాద్, రైతులు ఉన్నారు.

నల్లమాడ : రైతులు ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి ఉంటే.. తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ సుమతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ-క్రాస్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయన్నారు.

డ్రిప్ పైపుల దొంగల అరెస్టు

బత్తలపల్లి ఆగస్టు 23 : రైతుల పొలాల్లో డ్రిప్ పైపులు దొంగలించే ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన రంగస్వామి తోటలో ఈ నెల 20న ఆరు కట్టల డ్రిప్ పైపును దొంగలించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కదిరి రోడ్డులోని సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద బానుకోటకు చెందిన భూపతి రాజు, రామోహన్‌రెడ్డి, అనంతపురానికి చెందిన జగదీశ్వర్‌ను అరెస్టు చేశారు. వారి వద్దనుండి ఆ కట్టల డ్రిప్ పైపు కట్టలను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోండి

కదిరి, ఆగస్టు 23: పట్టణంలోని దుకాణదారులు అందరూ తమ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కోనేరుకు సమీపంలోని ఎస్వీకే ఫంక్షన్ హాల్‌లో దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తద్వారా దుకాణాల్లో ఏదైనా సంఘటన జరిగినపుడు నేరస్తులు, ఇతర ప్రమాదాల గుర్తింపునకు ఉపయోగపడు తుందన్నారు. వాహనాలను కేటాయించిన ప్రదేశంలోనే పార్కింగ్ చేయాలన్నారు.

సాయిగాయత్రీ నివాస్ ప్రారంభం

పుట్టపర్తి, ఆగస్టు 23: సత్యసాయి సేవాదళ్ కోసం ప్రశాంతి నిలయంలో నిర్మించిన సాయిగాయత్రీ నివాస్ భవనాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ శుక్రవారం ప్రారంభించారు. 800 మంది సేవాదళ్ సభ్యులు ఉండేందుకు అనువుగా ఈ భవనాన్ని నిర్మించారు.



గాయత్రీ నివాస్‌లో పూజలు చేస్తున్న రత్నాకర్



కమ్మపాళ్యంలో తెగిపోయిన విద్యుత్ తీగ

కొత్తచెరువులో కరెంటుకు కటకట

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు

కొత్తచెరువు, ఆగస్టు 23 : కొత్తచెరువులో అప్రకటిత కోతలతో జనం అల్లాడిపోతున్నారు. ఒక పక్క ఎండ కాలాన్ని తలపిస్తున్న ఎండలు... విద్యుత్ కోతల వల్ల కనీసం ఫ్యాన్ కూడా వేసుకోలేక ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. ఉన్నతాధికారులు మాత్రం విద్యుత్ కోతలు లేవని చెబుతుంటే... పది రోజుల నుంచి మెయిన్ సప్లైలో అంతరాయం కలుగుతోందని స్థానిక ట్రాన్స్‌కో అధికారులు చెబుతుండటం విడ్డూరంగా ఉంది. స్థానికంగా విద్యుత్ లైన్లలో సమస్యలను కప్పిపుచ్చుకునేందుకు కోతలు ఉన్నాయని ప్రజలను మభ్యపెడుతున్నట్లు సమాచారం. స్థానిక వేణుగోపాల్ నగర్ కాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి దాదాపు 10 రోజులైంది. ఇంతవరకు దాని స్థానంలో కొత్త డీపీని ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ కాలనీలోని ప్రజలు విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ తాగునీరు కూడా సరఫరా కావడం లేదు. దీంతో ఆ కాలనీవాసులు ట్యాంకర్‌కు రూ.800 చెల్లిస్తూ నీటిని కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా కమ్మపాళ్యంలో కూడా గురువారం రాత్రి విద్యుత్ ఎల్‌టీ లైన్ తెగిపోయింది. ఆ సమయంలో ఎవరు బయట లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక వేళ చిన్నపిల్లలు, వృద్ధులు ఉండి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేది. ఇటీవల కాలంలో లింగారెడ్డిపల్లి ప్రధాన రహదారి వద్ద, పెద్ద మసీదు వద్ద 11 కేవీ విద్యుత్ లైన్ తెగిపడింది. అయితే లైన్లు తెగిపోయినప్పుడు ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒకవేళ విద్యుత్ సరఫరా అలాగే ఉండి ఉంటే.. పొలాలకు వెళ్లే రైతులు మృత్యువాత పడేవారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్‌ను వివరణ కోరగా.. సిబ్బంది కొరత వల్ల విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ సమస్యను ఉన్నతాధికారులకు కూడా తెలియజేశామని అన్నారు. త్వరలోనే విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

టీడీపీ నాయకురాలి కుమారుడి మృతి

కదిరి, ఆగస్టు 23: టీడీపీ రాష్ట్ర మైనార్టీ నాయకురాలు ఫర్వీన్ బాను కుమారుడు రోషన్‌వలీ (35) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మరణించాడు. రోషన్‌వలీ టీడీపీలో యువ నాయకుడిగా పని చేశాడు. అతను మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు అతని నివాసానికెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

పుట్టపర్తి, ఆగస్టు 23: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జయంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని బ్రిటీష్‌వారి తుపాకికి ఎదురునిలిచి ఆంధ్రకేసరిగా పేరొందారన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలిముఖ్యమంత్రిగా విప్లవాత్మక నిర్ణ యాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్ఓ భాగ్యరేఖ, బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలా జ్యోతి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివరంగప్రసాద్, సీపీఓ విజయ్‌కుమార్, డ్వామాపీడీ విజ యేంద్రప్రసాద్, సీడాక్‌అధికారి ఉదయ్ పాల్గొన్నారు.

ధర్మవరం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, రమణ, పాఠకులు పాల్గొన్నారు.



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

నేడు ఏడుకొండల స్వామి వ్రతం

మడకశిరటౌన్ : శ్రావణమాసం పురస్కరించుకొని పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం ఉదయం ఏడు కొండల స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అనంతరం గం గాపూజ, గోపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహారాధన, సప్త మాతృకల పూజ చేస్తారన్నారు. అనంతరం 10.30కు ఏడు శనివారాల వ్రతం ప్రారంభమవుతుందన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ధర్మవరం : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, జీఓ నెంబరు 117ని రద్దు చేసి మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతలు కల్పించా లని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 2016 నుంచి ఇప్పటివరకు మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగో న్నతలు కల్పించలేదని, ప్రస్తుతం జరుగుతున్న పని సర్దుబాటు సరిగా లేదని అన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నాగప్ప, ప్రధాన కార్యదర్శి జగదీశ్, ఉపాధ్యాయులు వెంకటరాముడు, ఖాజామోటహిబ్, శ్రీనివాసరెడ్డి, బషీర్ అహమ్మద్, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు



కర్జూరాల అలంకరణలో అష్టలక్ష్ములు, లక్ష్మీనారాయణుడు

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 23: పట్టణ పరిధిలోని డీబీ కాలనీ లో వెలసిన అష్టలక్ష్మీ ఆలయం, నింకంపల్లిలోని ఎల్లమ్మ ఆలయం, కన్య కాపరమేశ్వరి తదితర ఆలయాల్లో శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని వైభవంగా పూజలు చేశారు. డీబీ కాలనీలో అష్టలక్ష్ము లను, లక్ష్మీనారాయణుడుని కర్జూరాలతో అలంకరించారు. ఎల్లమ్మ ఆల యంలో పూలు, నిమ్మకాయలతో అమ్మవారిని అలంకరించారు.

ఘనంగా వరలక్ష్మీవ్రతం

హిందూపురం పట్టణ పరిధిలోని మేళాపురంలో టీడీపీ నాయకుడు, మునిసిపల్ కౌన్సిలర్ మాజీ నంజప్ప స్వగృహంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా అచరించారు.

లేపాక్షి : వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం లేపాక్షిలో పలువురు ఘనంగా నిర్వహించా రు. అమ్మవారి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ముత్తైదువులను ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందింజేశారు.



లేపాక్షిలో వరలక్ష్మీదేవి



నింకంపల్లిలో ఎల్లమ్మ



మేళాపురంలో వరలక్ష్మీదేవి

అంచనా కమిటీ సమావేశంలో ఎంపీ బీకే



సమావేశంలో పాల్గొన్న బీకే పార్థసారథి

పెనుకొండ, ఆగస్టు 23 : ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన పార్లమెంట్ అంచనాల కమిటీ సమావేశంలో కమిటీ సభ్యుడైన హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పాల్గొన్నారు. కమిటీ సమావేశంలో పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు ఏడు కొండల స్వామి వ్రతం

మడకశిర టౌన్, ఆగస్టు 23: శ్రావణమాసం పురస్కరించుకొని పట్ట ణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం ఉదయం ఏడు కొండల స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అనంతరం గం గాపూజ, గోపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహారాధన, సప్త మాతృకల పూజ చేస్తారన్నా రు. అనంతరం 10.30కు ఏడు శనివారాల వ్రతం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు అయ్యప్పస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు గిరిప్రదక్షిణ

హిందూపురం అర్బన్, ఆగస్టు 23: పట్టణ పరిధిలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద ఆదివారం గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు, అర్చకుడు గోవిందశర్మ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్యేకి ఆహ్వానం

మడకశిరటౌన్, ఆగస్టు 23: పట్టణంలోని గాంధీబజార్‌లో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కమిటీ సభ్యులు ఆహ్వానించారు. గాంధీబజార్‌లోని గణేష్ మండపం వద్ద 26వ తేదీ ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఆదెప్ప తెలిపారు. అదేవిధంగా 27వతేదీన పట్టణంలో ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పెనుకొండ సీఐగా రాఘవన్

అనంతపురం క్రైం,ఆగస్టు 23 : పెనుకొండ సీఐగా రాఘవన్‌ను నియమించారు. కొన్ని రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. విజయవాడలో పనిచేస్తున్న ఆయనను తొలుత స్పెషల్ బ్రాంచ్‌కు కేటాయించారు. తాజాగా అది కాన్సిల్ చేస్తూ పెనుకొండ సీఐగా శుక్రవారం నియమించారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 23 : అగిళి పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రామాంజినేయులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అగిళి పోలీసుస్టేషన్‌లో జప్తు చేసిన ద్విచక్రవా వానాన్ని ఓ మెకానిక్ షాపుషెడ్డు వద్దకు తీసుకెళ్లి విడి భాగాలను మార్చేందుకు ప్రయత్నించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విదితమే. ఈ విషయాన్ని ఎస్పీ తీవ్రంగా పరిగణించి ప్రాథమిక విచారణ అనంతరం హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళకు పాముకాటు

గోరంట్ల, ఆగస్టు 22: మండలపరిధిలోని వానవోలు గ్రామానికి చెందిన మహిళ రైతు జయమ్మ పాముకాటుకు గురై శుక్రవారం అస్వస్థత పొందారు. లక్ష్మీనరసప్ప భార్య జయమ్మ గ్రామంలోని వరి పొలంలో పనికి వెళ్లిన సమయంలో ఎడమచేతిపై పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబసభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో పుట్టపర్తికి తరలించారు.

దేశాభివృద్ధికి పల్లెలు పట్టుగొమ్మలు

- అధికారులు, నాయకుల వెల్లడి
- గ్రామసభలకు పోటెత్తిన జనం



పూలకుంటలో గ్రామసభకు హాజరైన జనం

హిందూపురం, ఆగస్టు 23 : దేశాభివృద్ధిలో పల్లె పట్టుకొమ్మలాంటి దని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శుక్రవారం చేపట్టిన గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధు లు, నాయకులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పల్లెలు అభివృద్ధి చెందినరోజే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందుకు పల్లె ల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పల్లెల అభివృ ద్ధి గాలికి వదిలారన్నారు. దీనివల్ల ఏ గ్రామంలో చూసినా సమస్యలు తాండవిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉం చుకుని ఉప ముఖ్యమంత్రి గ్రామాలాభివృద్ధిపై దృష్టిసారించారన్నారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన వివిధ అంశాలపై గ్రామసభ ల్లో చర్చించారు. గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రజల సహకారం ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యం అవుతుంద న్నారు. మణేసము ద్రంలో మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, సర్పంచ్ ఉషారాణి, పూల కుంటలో సర్పంచ్‌మంజునాథ్, రామక్రిష్ణారెడ్డి, కొటిపిలో టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచల్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, కిరికెరలో హెచ్‌ఎన్ రాము, బేవనహళ్లిలో టీడీపీ టీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, తూమకుంటలో చిక్కీరప్ప, నాగరాజు, సర్పంచ్ రత్నమ్మ, కగ్గల్లులో సర్పంచ్ విజయలక్ష్మి, హనుమంతు, ఎంపీడీఓ రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని 20 పంచాయతీల్లో అధికారులు శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. గోరంట్ల మార్కెట్‌యార్డులో జరిగిన గ్రామసభలో టీడీపీ నా యకుడు గిధర గౌడ్, మాజీ ఎంపీటీసీ మునిస్వామి, టీడీపీ రజక సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. గత ఐదేళ్లుగా సమస్యలతో విసిగిపోయిన జనం తమ సమస్యలను అధికారులకు విన్నవించడానికి ఒక్కసారి చుట్టుముట్టడడంతో గందరగోళ పరిస్థితి నెలకుంది. డీపీఓ విజయక్‌కుమార్‌రెడ్డి వారికి సర్దిచెప్పే ప్రయ త్నం చేశారు. గోరంట్ల పంచాయతీలో మొత్తం 46 వివిధ పనులకు సంబం దించి వినతులు అ ందినట్లు కార్యదర్శి బాబురావు తెలిపారు. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, సర్పంచ్ సరోజానాగేనాయక్, టీడీపీ కన్వీనర్ సోముశేఖర్, పలువురు నాయకులు, పంచాయతీ, ఉపాధి సిబ్బంది, ప్రజలున్నారు.

పెనుకొండ రూరల్ : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీడీఓ శివశంకరప్ప, డీఎల్‌డీఓ సమత పేర్కొన్నారు. మండలంలోని గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, మునిమడుగు శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో మండల అధికారులు పాల్గొన్నారు. రాజకీయ నాయకులు, ఆయా గ్రామా ప్రజలు పలు సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఏపీఓ జయమ్మ, మాజీ ఎంపీపీ కేశవయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మునిమడుగు చిన్నవెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లలో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్



గుట్టూరులో గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సమత

అతిసార బాధితులకు మెరుగైన వైద్యసేవలందించండి

జిల్లా వైద్యాధికారి మంజువాణికి మంత్రి సవిత ఆదేశం



మడకశిర, ఆగస్టు 23 : రొళ్ల మండలంలోని ఎం రాయాపురం, గుడిబం డ మండలంలోని కొంకల్లు గ్రామాల్లో పా రిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూనే, అతిసార బాధితులకు మెరుగైన వైద్యసేవ లందిం చాలని జిల్లావైద్యాధికారి మంజువాణిని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. ఈ మేరకు మంత్రి సవిత జిల్లావైద్యాధికారి మంజువాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లికార్జునను శుక్రవారం ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆ రెండు గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గ్రామాల్లో సాధారణ పరిస్థితి వచ్చేంతవరకు వైద్యశిబిరాలను కొనసాగించాలన్నారు. సురక్షిత మైన తాగు నీటిని సరఫరా చేయాలని, కాచి చల్లార్చిన నీరు వేడి భోజనం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పచచాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. పరిసరాల పరిశు భ్రతపట్ల ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందనే విషయంపై బాధితుల్లో భరోసా నింపాలని జిల్లావైద్యాధికారిని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యం లో జిల్లా అంతంటా అతిసార నివారణ ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు సంక్షేమ హా స్టళ్లను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

రాయాపురాన్ని సందర్శించిన అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లికార్జున

రొళ్ల, ఆగస్టు 23 : మండలంలోని ఎం రాయాపురం గ్రామంలో పారిశుధ్యం లోపంతో అతిసారం ప్రబలి ప్రజలు అనారోగ్యం బారినపడ్డారు. ఈనేపథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ మంజువాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లికార్జున శుక్రవారం గ్రామంలో పర్యటించారు. ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామంలో సాధారణ పరిస్థితి వచ్చే వరకు వైద్యశిబిరాలు కొనసాగించాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పారిశుధ్యం వందశాతం చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లికార్జున గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

అన్నదానం : ఎం రాయాపురం గ్రామంలో అతిసార వ్యాధితో బా ధపడుతున్న కుటుంబాలకు వైద్య సేవలు అందించడానికి వచ్చిన సిబ్బందికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు అన్నదానం ఏర్పాటు చేశా రు. రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, టీడీపీ నాయకులు చంద్రప్ప, బీజేపీ నాయకులు ముద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మరమ్మతుల పరిశీలన

పెనుకొండ, ఆగస్టు 23 : పట్టణంలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో జరుగుతున్న మరమ్మతుల పనులను, కొత్తగా మంజూరైన బీసీ గురుకుల పాఠశాల కోసం, ఎంపిక చేసిన ప్రభుత్వ భవనాల మరమ్మతుల పనులను పంచాయతీరాజ్ అధికారులు పరిశీలిం చారు. పంచాయతీరాజ్‌శాఖ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ మురళీధర్, వారి సిబ్బంది శుక్రవారం సాయం త్రం పనులు పరిశీలించారు. త్వరితగతిన పూర్తీచేయాలని ఆదేశించారు. వారి వెంట టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, కౌన్సిలర్ సప్తగిరి, గీతా హనుమంతు, త్రివేంద్రనాయుడు, సుబ్రహ్మణ్యం, దాదు, చంద్రాయుడు, ప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను జైలుకు పంపాలి

ఎమ్మెల్యే వద్ద ఓ మహిళ ఆవేదన



కల్లుమర్రి గ్రామ సభ వద్ద ఎమ్మెల్యే ఎదుట కంటితడి పెట్టిన మర్రియమ్మ

మడకశిర రూరల్, ఆగస్టు 23 : చంద్రబాబునాయుడును అక్ర మంగా జైలుకు పంపిన జగన్‌ను కూడా జైలుకు పంపించాలని మడ కశిర మండలం కల్లుమర్రి గ్రామానికి చెందిన మర్రియమ్మ.. ఎమ్మెల్యే రాజుకు విన్నవించింది. కల్లుమర్రిలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొంది. సభ అనంతరం ఎమ్మెల్యే వద్దకెళ్లి కన్నీరుమున్నీరుగా విల పించింది. చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లినపుడు మూడురోజులు అన్నం కూడా తినకుండా ఏడ్చుకుంటూ ఇంట్లోనే ఉండిపోయినట్లు తెలిపింది. అనేక అక్రమాలకు పాల్పడిన జగన్‌ను జైలుకు పంపించా లని ఎమ్మెల్యే ఎదుట కన్నీళ్లు పెట్టుకుంది.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



సానిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రకాశం జయంతి వేడుకలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 23 : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం రొద్దం మండలం లోని సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు దేశభక్తి గీతాలు అలరించాయి. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయు లు నారాయణస్వామి, కృష్ణానాయక్, సత్యమయ్య, మహదేవ్‌రెడ్డి, జయమ్మ, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ, ఆగస్టు 23: మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, అధ్యాపకులు, కేశవరెడ్డి, శంకరప్ప, జయప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక ఎమ్మెల్యేపై అక్కసు

- టీడీపీ నాయకుల మండిపాటు

మడకశిర టౌన్, ఆగస్టు 23: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నేతలు, మాజీ సీఎం జగన్ సొంత పత్రిక అక్కసు వెళ్లగక్కుతున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు భక్తర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహ రాజు తదితరులు శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కా రం కోసం ఎమ్మెల్యే సొంత డబ్బుతో దాదాపు 20 బోర్ల వరకు వేయించా రని అన్నారు. ఏ ఎమ్మెల్యే చేయని విధంగా అభివృద్ధి చేపడుతుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో అప్పటి ఎమ్మెల్యే తిప్పేస్వామి నేరుగా అవినీతికి పాల్పడినా వారికి కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఈ విధంగానే నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకు పోతే తమ ఉనికి ఉండదని... ఉద్దేశపూర్వకంగా ఆ పత్రికలో తప్పుడు కథనాలు రాయిస్తు న్నారని అన్నారు. ఇలాంటి వాటిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని, మరోసారి ఇలా జరిగితే తగిన గుణపాఠం చెబు తామని హెచ్చరించారు. ఈసందర్భంగా డాక్టర్ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు కృష్ణమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు శివాజీ, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, పుల్లయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో ప్రసంగిస్తున్న ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి

హిందూపురం(సోమందేపల్లి) : ఉపాధిహామీ పనులపై శుక్రవారం సోమందేపల్లి మండలంలో నిర్వహించిన గ్రామసభల్లో సమస్యలు వెల్లువలా వచ్చాయి. అభివృద్ధి పనులకు సంబంధించి అర్జీలను అందజేశా రు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి

చిలమత్తూరు: గ్రామాల అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పార్టీ మండల కన్వీనర్ రంగారెడ్డి పేర్కొన్నారు. మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ పనులపై గ్రా మ సభలు నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ సంధ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేమకేతేపల్లి సభలో టీడీపీ సీనియర్ నాయకులు మాట్లాడారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని కోరారు. ఎంపీడీఓ నరేష్ కృష్ణ, జడ్పీటీసీ అనూష, టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, గౌరీశంకర్, నందీషప్ప, అశ్వత్థప్ప, ఆంజినేయులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోడిపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ నరసింహమూర్తి

అగళి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని టీడీపీ కోడిపల్లి సర్పంచ్ నరసింహమూర్తి పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనులపై శుక్రవారం మండలంలోని కోడిపల్లిలో సర్పంచ్ నరసింహమూర్తి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులు అర్జీలు స్వీకరించారు. జడ్పీటీసీ ఉమేష్, ఎంపీడీఓ రవి ప్రసాద్, ఏపీఓ శివన్న, టెక్నికల్ ఇంజనీర్ శ్రీధర్, ఇరిగేపల్లి సర్పంచ్ లక్ష్మమ్మ, లింగరాజు, ఎంపీటీసీ రంగమ్మ, సర్పంచ్‌లు మల్లికార్జున, నరసింహమూర్తి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుడిబండలో అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామారావు

గుడిబండ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నా రు. మండలంలోని చిగతుర్పి గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహిం చారు. అన్ని పంచాయతీ గ్రామాల్లో మండల స్థాయి అధికారులు గ్రామసభ లు నిర్వహించారు. ఏఓ నారాయణప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి హరి, వివిధశాఖల అధికారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రొళ్లలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు గురుమూర్తి

రొళ్ల : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు కోసం శుక్రవారం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్య క్షతన గ్రామసభలను నిర్వహించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీడీఓ ఆజాద్, ఏపీఓ ఓబుళప్ప, టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, రొళ్ల ప్రధాన కార్యదర్శి ఈరన్న, తెలుగు యువత నాయకుడు బాలకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



అమరాపురం సభలో పాల్గొన్న ప్రజలు, అధికారులు

మడకశిర(అమరాపురం) : మండలంలోని 11 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. అమరాపురం సభలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్ మాట్లాడుతూ... మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఈ సభల్లో మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, టీడీపీ నాయకులు శివరుద్రప్ప, మారుతీ ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్ బీజేపీ, జనసేన నాయకులు, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ రాజ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దేవాలయాలపై దాడులు ఆపాలి'



కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 23: బంగ్లాదేశ్‌లో హిందువులపై, దేవాలయాలపై దాడులను వెంటనే ఆపాలని హిందూ సం ఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. అలాగే కోల్‌కతాలో వైద్య విద్యా ర్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక చిన్న మార్కెట్ పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు.

ఎట్టకేలకు గుంతలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం అర్బన్, ఆగస్టు 23: ఎట్టకేలకు పట్ట ణంలో పలు చోట్ల గుంతలకు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 21వ తేదీన ఆంధ్రజ్యోతిలో వెలువడిన నడిరోడ్డుపై గోతులతో ప్రమాదాలు అనే కథనానికి ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించారు. శుక్రవారం పట్టణంలో పలు చోట్ల మరమ్మ తులు చేపట్టారు. గుంతలకు మట్టితోలి, ఎక్స్‌కవేటర్లతో చదును చేసి రోలర్‌తో రోడ్డు పనులు చక్కపెట్టారు. పట్టణంలో రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఎదుట పెద్ద పాటి గుంతను మట్టితో పూడ్చివేశారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో కూడా మట్టితో కప్పిపెట్టారు. అయితే వర్షం కురిస్తే రోడ్డు బురదమయమై మరలా గోతులు ఏర్పడతాయని, త్వరలో వినాయక నిమజ్జనం ఉంది కాబట్టి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలంటే కంకరతో తారు రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు చర్చించుకున్నారు.